## ఉచిత కంటి వైద్య శిబిరాలులి

**పోతంగల్ ఫిబ్రవరి 20(డిడి9వార్త):** నిజాంబాద్ జిల్లా మండలంలోని గన్నారం లింగాపూర్ గ్రామాల్లో లైన్స్ క్లబ్ ఆఫ్ బేర్కూరి ఆధ్వర్యంలో బోధన్ లైన్స్ క్లబ్ సహకారంతో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 65 మందికి పరీక్షలు చేయగా 14 మందికి మొదటి బిందు ఆపరేషన్ కొరకు బోధన్ లైన్స్ క్లబ్ ఆసుపత్రికి పంపించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో కంటి వైద్య సహాయకులు.లింగపూర్ సర్పంచ్ దెగం హనుమంతు, గన్నారాం సర్పంచ్ శారద రాజప్ప పటేల్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైర్ కట్టలను దొంగలించిన దుండగులు



**పోతంగల్ ఫిబ్రవరి20(డిడి9వార్త):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని గాన్నారం గ్రామంలో శ్రీ చౌదరి బాలాజీడశంకప్ప వయస్సు 42.కులం లింగయత్ అనే వ్యక్తి 17.02.2026న సాయంత్రం 6 గంటలకు తన ఇంటి వద్ద రూ.25000/.విలువైన 25 హవెల్స్ కంపెనీ వైర్ కట్టలను ఉంచాడు.తిరిగి 18.02.2026.ఉదయం10.గంటల కు అతని ఇంట్లో వెల్లి చూడగా ఇంట్లో ఉంచిన వైర్ కట్టలు కనిపించలేదు, గుర్తుతెలియని, దుండగులు అతని ఇంట్లో చొరబడి రూ.25000/- విలువైన 25 హవేల్స్ కంపెనీ వైర్ కట్టలను దొంగలించి.రెండు బెడ్‌రూముల లోని వైర్లను తంచారు.అని దరఖాస్తు ఇవ్వగ కేసు నమోదు చేసి దంర్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## మన ఇసుక వాహనం ప్రారంభం





**పోతంగల్ ఫిబ్రవరి 20(డిడి9వార్త):** నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలో హంగార్గ గ్రామంలో మన ఇసుక వాహనం ఎంఆర్ఒ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.వాళ్ళ ఇద్దరు మాట్లాడుతూ కొద్ది రోజులుగా ట్రాక్టర్ వాహన యజమానులు చాలా అవస్థలు పడ్డారు అని చెప్పారు ఇప్పుడు మన ఇసుక వాహనం ఆప్ ఓపెన్ కావడం లో చాలా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఒ గంగాధర్.హంగర్గా గ్రామ సర్పంచ్.ఉదయ్ భాస్కర్,ఉప సర్పంచ్ దుర్కి గోపాల్,పట్వారీ,సెక్రెటరీ,గ్రామ పెద్దలు,ట్రాక్టర్ యునియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సాలూర మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి పద్మ



**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలూర మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి పద్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో సంక్షేమ పథకాల అమలు తీరును మెరుగుపరచడంతో పాటు, క్షేత్రస్థాయిలో పాలనను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఈమెను నియమించింది. జిల్లా సంక్షేమ అధికారిగా ఉన్న అనుభవంతో, మండలంలోని అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందేలా చూడటమే తన ప్రాధాన్యతని ఆమె పేర్కొన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా, క్షేత్ర స్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ అభివృద్ధి పనులను పరుగులు తీస్తామని ఆమె తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఎంపీడీఓ శ్రీనివాస్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## గోదావరిలో దూకిన మహిళ గుర్తింపు

**- నాందేడ్ జిల్లా వాసిగా నిర్ధారణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నవీపేట్ మండల పరిధిలోని బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళ వివరాలు లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. మృతురాలిని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకా కాక్టెలి గ్రామానికి చెందిన అనసూయా దిలీప్ మోతెవాడ (23)గా గుర్తించినట్లు వెల్లడించారు. బాధితురాలు దిలీప్ మోతెవాడ భార్య అని, కుటుంబ సమస్యల కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ప్రజా సేవలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : సాలూర మండల ప్రత్యేక అధికారి డి.పద్మ

**- ఎంపీడీఓ కార్యాలయంలో శాఖల వారీగా సుదీర్ఘ సమీక్ష**

**- పాఠశాలలు, ఆసుపత్రుల ఆకస్మిక తనిఖీ..**

**- మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పేదవాడికి చేరాలని సాలూర మండల ప్రత్యేక అధికారి, నిజామాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి డి.పద్మ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె సాలూర మండల కేంద్రంలో పర్యటించి, పాలనాపరమైన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శాఖ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు, మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై అధికారులను ఆరా తీశారు. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలను ఆదేశించారు. సేవల్లో ఎటువంటి జాప్యం జరగకూడదని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని హెచ్చరించారు. సాలూర ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన ప్రత్యేక అధికారి అక్కడ విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. వంట గదులను తనిఖీ చేసి నాణ్యమైన సరుకులు వాడుతున్నారా లేదా ఆరా తీశారు. మెనూ ప్రకారం గుడ్లు, పౌష్టికాహారం అందించాలని భోజనం రుచికరంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, గర్భిణీలకు అందుతున్న కిట్లు, టీకాల పంపిణీపై రిజిస్టర్లను పరిశీలించారు. అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులో ఉండాలని,









గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారి రాజ్‌కుమార్‌కు సూచించారు. అనంతరం బోధన్ పట్టణం అచన్‌పల్లిలోని ఉన్న మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ సంక్షేమ గురుకుల (సాలూర) పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్ వసతులు, తాగునీటి సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని ప్రిన్సిపాల్ మహేశ్వరికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో రాజీ పడకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ విస్తృత స్థాయి తనిఖీలు, సమీక్షలో సాలూర ఎంపీడీఓ హెచ్. శ్రీనివాస్, ఎంఈఓ రాజి మంజూష, ఎంజేపీటీ ప్రిన్సిపాల్ మహేశ్వరి, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్, ఏపీఎం ఐకేపీ సాయిలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి, విద్యుత్ శాఖ ఏఈ కళ్యాణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్ యాదవ్, మిషన్ భగీరథ ఏఈ రోహిత్, పంచాయతీ రాజ్ ఏఈ శివ తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# యువతే లక్ష్యంగా గంజాయి దందా.. ఆరుగురు నిందితుల అరెస్టు

**- బాల్కొండలో పోలీసుల మెరుపు దాడి.. 1.2 కిలోల గంజాయి స్వాధీనం**

**- మహారాష్ట్ర నుంచి దిగుమతి.. ఏజెంట్ల ద్వారా విక్రయాలు**

**నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లాలో యువతను మత్తు ఊబిలోకి నెడుతున్న గంజాయి ముఠా గుట్టును బాల్కొండ పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు సీపీ సాయి చైతన్య కేసు వివరాలను తెలిపిన ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మాదక ద్రవ్యాల విక్రయానికి సిద్ధంగా ఉన్న ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 30 వేల విలువైన 1.2 కిలోల ఎండు గంజాయి, 6 మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఆర్మూర్ పెర్కిట్‌కు చెందిన ప్రధాన నిందితుడు మొహమ్మద్ అంజత్ అలీ గతంలోనూ పలు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇతను మహారాష్ట్రలోని కిన్వాత్‌కు చెందిన మున్ని అనే మహిళ వద్ద కిలో రూ. 20 వేలకు గంజాయి కొనుగోలు చేసి, ఆర్మూర్, పెర్కిట్, బాల్కొండ ప్రాంతాల్లో చిన్న చిన్న ప్యాకెట్లుగా (5 గ్రాములు) విభజించి రూ. 400 నుండి 500 వరకు విక్రయిస్తున్నాడు. లాభాల కోసం అంజత్ అలీ ఒక వ్యవస్థీకృత ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. ఒక్కో ప్యాకెట్‌పై రూ. 100 కమిషన్ ఇస్తూ విద్యార్థులు, యువతను ఏజెంట్లుగా మార్చుకున్నాడు. పట్టుబడిన వారిలో మనోజ్ కుమార్, జక్కుల గోవింద్ అనే విద్యార్థులు ఉండటం గమనార్హం. వీరితో పాటు మహమ్మద్ నయీమ్, అద్నాన్ మరియు ఒక బాల నేరస్థుడు కలిసి గంజాయి సరఫరా చేస్తున్నారు. ఫోన్ల ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా సాగిస్తున్నారు. ఈ కేసులో మున్ని (కిన్వాత్), వాహిద్ సుల్తాన్, సోఫియాన్, మోసిన్ (ఆర్మూర్) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై ఎన్డీపీఎస్ యాక్ట్‌తో పాటు, బాలుడిని అక్రమ రవాణాకు వాడుకున్నందుకు జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం కూడా కేసులు నమోదు చేశారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఆర్మూర్ రూరల్ సీఐ జి. జాన్ రెడ్డి, బాల్కొండ ఎస్ఐ







కె. శైలేందర్, సిబ్బంది శంకర్, భరత్ గౌడ్, నవీన్‌లను జిల్లా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

# పేద కుటుంబానికి ఆదుకున్న బిజెపి నాయకులులి

**పోతంగల్ ఫిబ్రవరి 20(డిడి9వార్త):**నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని కోడిచర్ల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కోటగిరి శ్రీను ఈటీవల ప్రమాదావశాస్తూ మరణించడం జరిగింది, స్థానిక బీజేపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు ఎన్నారై కోనూరు శశాంక్ గారు వెంటనే స్పందించి పోతంగల్ మండల సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్ చేతుల మీదుగా వారి కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి అండగా వుంటాను అని భరోసాని ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో బాన్సువాడ నియోజకవర్గ సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్, పోతంగల్ మండల సీనియర్ నాయకులు పబ్బ శేఖర్,మరియు డి మక్కయ్య, రాజుపాటిల్ గారు కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, కోడిచెర్ల బూత్ అధ్యక్షులు గైనిగాడి సాయిలు, బి వెంకటేష్, పి



నగేష్, ఎం గంగాధర్, జి కృష్ణ, కే విట్టల్, బీ జగన్, కే రాజు, వీ రాజు, సీనియర్ నాయకులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాలూరలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ



**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలూర మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ సభలో గడిచిన ఏడాది కాలంలో మండలంలో జరిగిన వివిధ అభివృద్ధి పనుల నివేదికలను అధికారులు ప్రజల ముందుంచారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా వివరించాయి. పనుల నాణ్యత, కూలీలకు చెల్లించిన వేతనాలు, నిధుల వినియోగంపై ఆడిట్ బృందం సంతృప్తి వ్యక్తం చేస్తూనే, కొన్ని సాంకేతిక లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు సంబంధించి ఎం-బుక్స్, ఎఫ్టీఓ జనరేషన్ సక్రమంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో డబ్బులు అందేలా చూడటంతో పాటు, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, నీడ వంటి వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. తనిఖీలో భాగంగా గుర్తించిన చిన్నపాటి పొరపాట్లను తక్షణమే సరిచేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారి నుంచి నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రతి పైసా ప్రజా ప్రయోజనాలకే ఖర్చు కావాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోక్కం లావణ్య, ఉప సర్పంచ్ సురేష్, ఏపీఓ, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**- నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల లైసెన్సులు రద్దు**

**- పీసీ పీఎన్డీటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కీలక ఆదేశాలు**




**నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీసీ పీఎన్డీటీ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు అన్ని రకాల ప్రభుత్వ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. పూర్తిస్థాయి అర్హతలు, వసతులు ఉన్న కేంద్రాలకు మాత్రమే కొత్త రిజిస్ట్రేషన్లు లేదా రెన్యువల్స్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ తమ రికార్డులను, నివేదికలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, ఇందులో ఏమాత్రం అలసత్వం వహించినా అనుమతులు నిలిపివేయాలని ఆదేశించారు. పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాల పనితీరుపై నిరంతరం నిఘా ఉంచాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సుప్రియ, శిఖర, డిప్యూటీ డీఎంహెచ్ఓలు అశ్వినీ, సమత, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో మెనూ మారితే కఠిన చర్యలు



**- విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై రాజీ పడొద్దు**

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం**



**నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, భవిత కేంద్రాల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ లో మండల ప్రత్యేక అధికారులతో ఆమె సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వారు గమనించిన పెండింగ్ పనులు, పాఠశాలల స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న భవిత కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి కావాలని గడువు విధించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి. మెనూ పాటించని వారిపై, కలుషిత ఆహారానికి కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబీవీలు సహా అన్ని బాలికల పాఠశాలల్లో సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని, మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయి ంచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, డీఈఓ అశోక్, ఆర్.సీ.ఓలు, ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ అభివృద్ధిలో కాంగ్రెస్ మార్క్ చూపిస్తాం

**- నగర మేయర్‌గా కూరగాయల ఉమారాణి బాధ్యతల స్వీకరణ**

**- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్**



**నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన కూరగాయల ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున పార్లమెంటులో తెలంగాణ బిల్లు పాస్ అయిందని గుర్తు చేశారు. ఇలాంటి చారిత్రాత్మక రోజున ఒక బీసీ బిడ్డ మేయర్‌గా బాధ్యతలు చేపట్టడం శుభపరిణామన్నారు. నగర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ తనదైన ముద్ర వేస్తుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ రాష్ట్రంపై వివక్ష చూపుతోందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని, 250 గజాల స్థలానికి సంబంధించి త్వరలోనే కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల వరకే రాజకీయాలని, బాధ్యతలు చేపట్టాక నగరాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. నగరంలోని అన్ని డివిజన్లకు నిధుల కేటాయింపులో సమన్యాయం చేయాలని మేయర్‌ను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించారని, నగరాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# భీంగల్ కేజీబీవీలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** భీంగల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్, డ్రై స్వీపర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి డి.అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు కేవలం భీంగల్ మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డు ప్రతులు, బోనాఫైడ్ సర్టిఫికేట్లు పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారంతో కుప్పకంటి రోడ్డులో ఉన్న కేజీబీవీ పాఠశాలలో స్వయంగా హాజరై వివరాలు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కొనసాగుతుందని, అనంతరం 24న ఎంపిక ప్రక్రియ నిర్వహించి, 25న ఫలితాలను ప్రకటిస్తామని వెల్లడించారు. అర్హత కలిగిన స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నాగన్‌పల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ మండలంలోని నాందేడ్ ప్రధాన రహదారిపై నాగన్‌పల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు వేగంగా వచ్చి ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో వాహనాలపై ఉన్న ఇద్దరు వ్యక్తులు కిందపడి స్వల్ప గాయాలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు ప్రాథమిక సహాయం అందించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# హున్సాలో వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలుర మండలంలోని హున్స గ్రామంలో వెలసిన సోమేశ్వర ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. ఈ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే గణపతి హోమం, నవగ్రహ శాంతి, రుద్ర యాగం వంటి విశేష క్రతువులను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. వేద మంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో హున్స గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మహా అన్నదానంలో వందలాది మంది పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలతోనే అధిక లాభాలు

**- జానకంపేట్‌లో రైతులకు అవగాహన సదస్సు**




**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** రైతులు బృందాలుగా ఏర్పడి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సాగులో అధిక లాభాలు గడించవచ్చని హైదరాబాద్‌కు చెందిన ఎఫ్‌పీఓ ఫాకల్టీ వెంకన్న పేర్కొన్నారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం రైతులకు ఎఫ్‌పీఓల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సమూహాలుగా ఏర్పడటం వల్ల సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని, పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేందుకు మెరుగైన మార్గాలు లభిస్తాయని వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ మెళకువలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ గంగారెడ్డితో పాటు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుర్నాపల్లిలో వైభవంగా ఎల్లమ్మ తల్లి విగ్రహ ఊరేగింపు

**- డప్పు వాయిద్యాల మధ్య పురవీధుల్లో శోభాయాత్ర**

**- ఈ నెల 22న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన**



**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి నూతన విగ్రహ ఊరేగింపు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించేందుకు వీలుగా సిద్ధం చేసిన విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. డప్పు వాయిద్యాల మోతలు, భక్తుల కోలాహలం మధ్య ఈ శోభాయాత్ర కోలాహలంగా సాగింది. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీన నూతనంగా నిర్మించిన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గ్రామస్థులందరూ తరలిరావాలని కోరారు.

# నేడు నవీపేట్ మండలంలో విద్యుత్ నిలిపివేత

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నవీపేట్ మండలంలోని పలు విద్యుత్ ఉప కేంద్రాల్లో అత్యవసర నిర్వహణ పనులు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ప్రశాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. నవీపేట్ సెక్షన్ పరిధిలోని రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వివరించారు. యంచ, నిజాంపూర్, కమలాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని స్పష్టం చేశారు. నిర్వహణ పనులకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

